# ఎర్రర్ ఆఫ్ డ్రాకులా

ఆయన పేరు వినాయకరావ్.

ఆయన దగ్గర తెల్లడబ్బు 'అస్సలు' లేనేలేదు.

ఎయిర్ కండిషన్ గదిలో ఫోమ్ కుషన్ సోఫాలో కూర్చొనిదే, ఆయన సోషలిజం గురించి మాట్లాడడు.

ఆ వూళ్ళో వున్న వ్యాపార సంస్థలలో ఒకటి రెంటింటిలో మాత్రం ఆయనకు ఏమీ వాటాలు లేవు.

కల్తీలంటే ఆయనకు గిట్టదు.

ఖరీదయిన వాటిల్లో చౌకరకం కలిపి అమ్మితే కల్తీ. అందుకని ఆయన చౌకరకం

వాటిల్లో ఖరీదయినవి కలిపి అమ్ముతాడు.

అంటే రాళ్ళలో బియ్యం కలిపి (బియ్యం అని చెప్పి) అమ్ముతాడు.

నీళ్ళలో పాలు కలుపుతాడు.

కిరసనాయిల్‌లో పెట్రోలు కలుపుతాడు.

వాడిన మోటార్ ఆయిల్‌లో కిరోసిన్ కలుపుతాడు.

మొత్తానికి అలా అలా డబ్బు చేసుకున్నాడు. చేసుకుంటున్నాడు.

కానీ యింతలో ఆయనకో మాయదారి రోగం పట్టుకున్నది.

ఆ రోగం పేరు అజీర్ణం.

దాన్ని ఇంగ్లీష్‌లో "కాపిటలిజం" అంటారు.

అందుకని ఆయన ఒక ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో చేరాడు.

అజీర్ణం కనుక లేవకుండా అలాగే మంచం మీద పడుకుని వున్నాడు.

చిన్న జబ్బు అయినా పెద్దవాడికి వచ్చింది కనుక రాత్రింబగళ్ళు నర్సులు మేలుకొని ఆయన్ని జాగ్రత్తగా చూస్తున్నారు.

అలా చూస్తూ చూస్తూ వుండగా ఒక రోజు రాత్రి...

★ ★ ★

అతని పేరు డ్రాకులా.

ఇంగ్లీష్ సినిమాలు చూసేవాళ్ళకు తెలుసు, డ్రాకులా ఎలా వుంటాడో, ఏం చేస్తాడో.

ఇంగ్లీషు సినిమాలు చూడనివాళ్ళకు చూసేవాళ్ళను (ఇంగ్లీష్ సినిమాలను) అడిగితే చెబుతారు డ్రాకులా అంటే ఏమిటో, ఎవరో.

డ్రాకులా అచ్చం "హారర్ ఆఫ్ డ్రాకులా" సినామాలో క్రిష్టఫర్ లీ లాగా ఉంటాడు.

ప్రక్కపళ్ళు కోరలలాగే సూటిగా ముందుకు చొచ్చుకుని వుంటాయి.

ముఖం పాలిపోయి శవం ముఖం లాగా వుంటుంది.

చూడగానే గుండె దడ పట్టుకునేంత భయంకరంగా వుంటుంది.

అతను మనిషి కాదు...

(ఆ మాటకొస్తే మన చుట్టూ తిరిగే వాళ్ళలో నిజంగా 'మనుషులు' ఎంతమంది?)

దయ్యం.

అవును. అతను నిజంగా దయ్యమే!

అతను చచ్చిపోయి దయ్యం అయ్యాడు కనుక మళ్ళీ చావు అనేదే లేదు.

అతనికి మనిషి రక్తం అంటే ప్రేమ... రుచి...

అతను రాత్రిళ్ళు శవపేటికలో నుంచి లేస్తాడు. కనపడ్డ మనుషులను మెడమీద కాటేస్తాడు. వాళ్ళు చచ్చేదాకా రక్తం త్రాగుతాడు. తెల్లవారబోయే సరికి శవపేటికలో చేరి,

శవం అయిపోతాడు.

అలవాటు ప్రకారం ఒక రోజు రాత్రి..

★ ★ ★

ఆ రోజు రాత్రి...

వినాయకరావ్ ప్రైవేట్ నర్సింగ్ హోంలో నిద్ర పోతున్నాడు.

గాఢ నిద్ర పోతున్నాడు...

స్పెషల్ రూమ్‌లో స్పెషల్ బెడ్ మీద కనుక రోగిలా కాకుండా కేపిటలిస్టులా నిద్ర పోతున్నాడు.

నర్సు ప్రక్కనే కుర్చీలో కూర్చుని వుంది.

అంతకుముందు చాలా రోజుల్నించి ఆవిడకు నిద్ర లేదు.

ప్రతి రోజూ కడుపు కాలుతుంటే నిద్ర ఏం వస్తుంది?

ఆమె కడుపులో కాలుతున్న దాన్ని ఆకలి అంటారు!

ఇంట్లో ఆమె మీద ఆధారపడ్డ వాళ్ళందరూ పస్తులుంటూ కడుపులో కాళ్ళు పెట్టుకుంటుంటే ఈమెకు నిద్ర ఎలా పడుతుంది.

ఆమెకు వచ్చే జీతంతో ఎన్ని జీవితాలు గడవ గలవు.

బ్లూలైటు ఖరీదుగా వెలుగుతున్నది.

వెలుగు మాత్రం సన్నగా వుంది.

ఆమె అలాగే కూర్చుని రోగి(?)ని కనిపెట్టుకు కూర్చుంది.

సోషలిజం అంటే కేపిటలిస్టుల ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కనిపెట్టుకు కూర్చోవటం.

రాత్రి పన్నెండు గంటల సమయం..

చీకటి చిక్కగా వుంది.

నిశీధి నిశ్శబ్దంగా వుంది.

రూమ్‌లో డోర్ కర్టెన్ అలా అలా కదులుతున్నది.

దాని వెనుకనే వున్నాడు.. డ్రాకులా.

అతనికి మనుషుల రక్తం కావాలి.

అతని అతి భయంకరమైన ముఖం మీద.. ఆనందం వెల్లి విరిసింది.

"నరవాసన" వేసింది గావును.

చటుక్కున ముందుకు దూకాడు.

ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

ఆమె తల ఎత్తి అతన్ని చూసింది.

లోతుగా పాలిపోయిన కళ్ళు, పొడుగాటి ముక్కూ, కోరల లాటి పళ్ళూ అంతే.. ఆమెకు కళ్ళు తిరిగినవి.

డ్రాకులా ఆమె మెడ మీద కాటేశాడు. ఆమె రక్తం త్రాగాడు.

ఆమె అలానే క్రిందపడిపోయింది.

చచ్చిపోయింది.

అతనిలో కొత్త శక్తి వచ్చింది.

ఒక క్షణం ఆగి, మంచం మీద మత్తుగా నిద్రపోతున్న కాపిటలిజాన్ని చూశాడు.

కండలు బాగా కొవ్వెక్కి నిండుగా వున్న ఆయన్ని చూడగానే డ్రాకులా నోరూరింది.

చటుక్కున ముందుకు వచ్చి ఆయన్ని పట్టుకున్నాడు.

మెడ మీద కాటేశాడు.

ఆయనకు మెళకువ వచ్చి, డ్రాకులాను చూశాడు.

డ్రాకులా గబగబా రక్తం త్రాగుతున్నాడు.

కానీ ఆయనకెందుకో చీమ కుట్టినట్టుగా కూడా లేదు.

పెద్దగా నవ్వాడు.

కొంచెం ఆగి మళ్ళీ నవ్వాడు.

రక్తం త్రాగుతున్న డ్రాకులా అమాంతం క్రిందపడిపోయాడు.

ఒళ్ళంతా నల్లబడింది.

నోట్లోంచి నురుగు వచ్చింది.

డ్రాకులా చచ్చిపోయాడు!

నిజంగానే డ్రాకులా చచ్చిపోయాడు!!

ఆయన మాత్రం నవ్వుతూనే వున్నాడు..

★ ★ ★

"ఏమయ్యా రచయితా! డ్రాకులాకు మళ్ళీ చావు లేదని వ్రాశావు. యిప్పుడేమో ఆయన రక్తం త్రాగి డ్రాకులా చచ్చిపోయాడని వ్రాస్తున్నావ్. నీ కలానికి రెండు పాళీలు లేవుకదా" అడిగాడు తెలివిగా పాఠకుడు.

రచయిత మాత్రం ఏం చేస్తాడు మరి.. జరిగిందది.

వినాయకరావ్‌గారి రక్తం అంతా విషపూరితం.

ఆయన రక్తం, విషం కల్తీ అయిపోయింది...

చావులేని వాళ్ళు కూడా గుటుక్కున చచ్చేంత విషం వుంది ఆయన రక్తంలో...

పూర్ డ్రాకులా..!

(ఆధారం : "త్రీ మస్కిటోస్" వారి మిమిక్రీ )